# ఒక్కసారి ప్లీజ్



**చంప**

**సాయంకాలపు నీరెండ కరిగించిన బంగారంలాగ పరుచుకుంటోంది. బీచ్ అల్లరిగా ఆహ్లాదకరంగా హాయిగా ఉంది. బీచ్‌లో కూర్చుని ఈ భౌతిక ప్రపంచంతో సంబంధం లేని యోగి పుంగవునిలా కళ్ళు మూసుకొని ఊహా ప్రపంచంలో విహరిస్తున్న అమర్ నాసికా పుటాలకు మొగలి సువాసన గుప్పుమని సోకగా ఈ లోకం లోకి వచ్చి పడ్డాడు.**

ఎదురుగా జిగేల్ జిగేల్ అప్సరస.

"యోగిపుంగవా! తపోభంగము కావించితినా? మీది కాకినాడ కదూ?" మల్లెల నవ్వు రువ్వుతూ ఎదురుగా కూర్చుందామె.

"తపోభంగము కావించిన అప్సరా! ఔను, మాది కాకినాడే" కొంటెదనాన్ని కొంటెగానే ఎదుర్కొన్నాడు అమర్. ఇద్దరూ నవ్వుకున్నారు.

కాకినాడ పురవీధుల్లోనో, థియేటర్ల వద్దనో, షాపుల్లోనో ఒకరినొకరు చూసుకున్నట్లే జ్ఞాపకం, ఇప్పుడు మాటలూ, పరిచయాలూ.

ఆమె కాకినాడలో పారిశ్రామికవేత్త రామదాసు గారమ్మాయి. అతడు కాలేజీలో కెమిస్ట్రీ లెక్చరర్. కొత్తచోట స్వగ్రామానికి చెందినవారు కనిపిస్తే ఎంతహాయి. ఎంత ఆనందం. ఆ హాయిని అనుభవిస్తూ కబుర్లలో మునిగిపోయారు.

చెప్పిన పాఠాలే ఏళ్ళ తరబడి చెబుతూ మొద్దుబారిన లెక్చరర్లకు నూతనాంశాలు తెలియజేసి పదును పెట్టడానికి ప్రతి ఏటా యూనివర్సిటీలో నెలరోజులపాటు రిఫ్రెషర్ కోర్సులు నిర్వహిస్తూ ఉంటారు. ఆ కోర్సు కోసం మూడు రోజుల క్రితమే విశాఖకు వచ్చిన అమర్ హాస్టల్‌లో ఉంటున్న శిష్యుని గదిలో కాలక్షేపం చేస్తున్నాడు. కానీ అలా ఉండడం నిబంధనలకు విరుద్ధం. ఒకటి రెండు రోజుల్లో బస మార్చాలి. బంధువులున్నారుగానీ యూనివర్సిటీకి బాగా దూరం. కోర్సు కోసం వచ్చిన లెక్చరర్లు బస చేయడానికి ఒక హాలు కేటాయించారుగానీ అక్కడ ఉండడం అమర్‌కిష్టం లేదు. ఏం చేయాలో తోచక సతమతమవుతున్నాడు.

ఎమ్మే వరకూ కాకినాడలోనే చదివిన జీవని ఇప్పుడు వాళ్ళ కంపెనీ గెస్ట్‌హౌస్‌లో ఉంటూ యూనివర్సిటీలో రిసెర్చ్ చేస్తోంది. కంపెనీ ఆఫీసర్లు పనిమీదగాని విహారానికిగాని విశాఖకు వస్తే బస చేయడానికి సకల సదుపాయాలతో నిర్మించిన నాలుగు బెడ్‌రూమ్‌ల గెస్ట్ హౌస్ అది.

"ఒక నెల రోజులే కదా! మీరు మా గెస్ట్ హౌస్‌లో ఉండొచ్చు. వెంటనే లగేజీ తెచ్చుకోండి" బలవంతం చేసిందామె.

❀ ❀ ❀

కాంపౌండ్ గేటు వద్ద ఆటో దిగి, పరుగున వచ్చిన వెంకన్నతో లగేజీ తన పక్క గదిలో పెట్టమని చెప్పింది జీవని. కానీ పావుగంట క్రితమే ఎవరో ఆ గదిలో దిగారని ఇంక గదులు ఖాళీగా లేవని చెప్పాడు వెంకన్న.

యూనివర్సిటీ కేటాయించిన హాలులోకి వెళ్ళడానికి సిద్ధపడ్డాడు అమర్. కానీ

"లగేజీ నా గదిలో పెట్టు"

అని వెంకన్నని ఆదేశించి చకచకా నడుస్తున్న ఆమెను అనుసరించక తప్పలేదు అమర్‌కి.

ఆమె ఉంటున్న గది విశాలంగా వుంది. రెండు బెడ్‌లు, అల్మరాలు, బీరువా, టేబుల్, కుర్చీలు అటాచ్డ్ బాత్ అంతా నీట్‌గా అందంగా తనో బెడ్ మీద కూర్చుని అతనికి కుర్చీ చూపించింది జీవని. సంకోచిస్తూనే కూర్చున్నాడు.

"మిస్టర్ అండ్ మిసెస్ శైలజా కృష్ణమూర్తి సినిమా చూశారా? మన పరిస్థితి అలాగే ఉంది కదూ?" గలగలా నవ్వింది. అతడు ముడుచుకుపోయాడు.

"కాస్త నవ్వండి బాబూ! నా మీద నాకు నమ్మకం ఉంది. మరి మీ మీద మీకు నమ్మకం లేకపోతే సరే వెళ్ళిపోవచ్చు" సమాధానం కోసం ఎదురు చూడకుండా బట్టలు తీసుకొని బాత్‌రూంలోకి వెళ్ళిపోయింది. వెంకన్న లైట్లు వెలిగించి అతని లగేజీ బీరువాలో సర్ది వెళ్ళిపోయాడు. తన మీద తనకు నమ్మకం ఉందని నిరూపించడానికైనా అక్కడే ఉండాలనిపించిందతనికి.

ఒక్కసారిగా మొగలి సువాసన గుప్పుమంది. చటుక్కున బాత్‌రూం వైపు చూశాడు. ఉల్లిపొర లాంటి నైటీ ధరించిన సన్నజాజి మొగ్గలాగ ఉందామె. శరీరం పొడిపొడిగా ఉండి నైటీ శరీరానికి అక్కడక్కడ అంటుకొని మనోహరంగా కనిపిస్తోంది. ముఖం చుట్టూ అంటుకున్న కురులు చందమామని దాచిపెట్టడానికి తాపత్రయ పడుతున్నాయి.

తను స్టూడెంట్ అయితే ఆ అందాన్ని చూసి వావ్! అని ఎగిరి గంతేసేవాడు. కానీ తను లెక్చరర్ కనుక బుద్ధిగా గుడ్లప్పగించి చూస్తూ ఊరుకున్నాడు. హంసలా నడిచి వచ్చి "స్నానం చేస్తారా!" అడిగింది. గుండె గుబగుబ దాచుకోడానికి చటుక్కున బాత్‌రూమ్‌లో దూరాడు. ఆమె ఉపయోగించిన సబ్బుతో ఒళ్ళు రుద్దుకొని స్నానం చేసి ఆమె తువ్వాలుతో తుడుచుకుంటూ ఉంటే పరవశంగా ఉందతనికి. తువ్వాలు నడుంకి బిగించి బయటకొచ్చాడు.

కండలు తిరిగిన సౌష్టవ శరీరం, ఛాతీ నిండా రోమరాశి చూస్తూనే వావ్ అని నోరెళ్ళబెట్టింది జీవని. అప్పుడుగాని తన పొరపాటు తెలియలేదతనికి. చాలా ఏళ్ళుగా ఒంటరిగానే ఉంటున్న అతనికి తువ్వాలు చుట్టబెట్టుకొని బాత్‌రూమ్ నుంచి నేరుగా బెడ్‌రూమ్‌కెళ్ళి బట్టలు వేసుకోవడం అలవాటు. అదే అలవాటు ఇప్పుడు అమ్మాయి

ఎదుట సిగ్గుపడేట్టు చేసింది. చటుక్కున బాత్‌రూమ్‌లో దూరాడు. అతని తడబాటు చూసి నవ్వుకొని అతని సూట్‌కేసులోని నైట్ డ్రెస్ తీసి తలుపు సందులోంచి అందించింది.

అతడు బయటకు రాగానే వేడివేడి టీ తీసుకొచ్చాడు వెంకన్న. టీ తాగాక అలా షికారు వెళ్ళి భోజనం చేసి వద్దామనుకున్నాడు అమర్. కానీ ఆమె ఒప్పుకోలేదు. భోజనం, టిఫిన్ అన్నీ యిక్కడే అంది. ఆ ఆత్మీయతను కాదనలేక పోయాడు.

❃ ❃ ❃

ఆమె రోజూ ఉదయం ఎనిమిదికి ఆర్ట్స్ కాలేజీకి వెళ్ళి ఒంటిగంటకొస్తుంది. అతనికి ఉదయం పది నుంచి పన్నెండు, మళ్ళీ మధ్యాహ్నం మూడు నుంచి ఐదు వరకు సైన్స్ కాలేజీలో లెక్చర్లు. పేరుకే రిఫ్రెషర్ కోర్సు కాని వాళ్ళు చెప్పేదీ, వీళ్ళు వినేదీ తక్కువే. ఒక్కోసారి లెక్చర్లే ఉండవు. అలాంటప్పుడు క్యాంటీన్‌లోనో యూనివర్సిటీలోని కాలేజీల చుట్టూ తిరుగుతూనో కాలక్షేపం చేస్తుంటారు.

కాస్త దూరం నడిచి ఓ చెట్టుకింద కూర్చుని ఆలోచనల్లో కూరుకుపోయాడు అమర్. తను గెస్ట్‌హౌస్‌కి మకాం మార్చి సుమారు ఇరవై రోజులవుతోంది. అడపాదడపా గెస్ట్‌హౌస్‌లో గదులు ఖాళీ అవుతున్నా తనని వేరే గదిలోకి వెళ్ళనివ్వలేదు జీవని. ఆమె సాన్నిహిత్యం ఊహాతీతమైన అనుభూతి. ఎన్నో జన్మల పరిచయంలాగ మధుర స్వప్నంలాగ ఉంది. అరమరికలు లేని ఆమె అమాయకత్వం తనని ముగ్ధుడ్ని చేస్తోంది.

లెక్చరర్‌గా చాలామంది అందమైన అమ్మాయిలతో తనకి సాన్నిహిత్యం ఉంది. కొందరు అమ్మాయిలు మరీ దగ్గరగా వస్తే మృదువుగానే మందలించి దూరం అయ్యాడు. ఎప్పుడూ వికారానికి లోను కాలేదు. మరి ఇప్పుడు మనసు మాట వినడం లేదు. లోలోనే కూనిరాగం తీస్తోంది. ప్రకృతి కూడా పరవశించి పాడుతున్నట్లు విశాఖ అంతటా దేవతలు నృత్యం చేస్తున్నట్టు అనిపిస్తోంది.

అర్ధరాత్రి హటాత్తుగా మెలుకువ వచ్చి చూస్తే నీలాల బీచ్‌లో ఆదమరిచి నిద్రిస్తున్న జలకన్యలా కనిపిస్తోందామె. ఫ్యాన్ గాలికి నుదుట నృత్యం చేసే కురులు ఉబ్బిపొర నైటీలోంచి తొంగి చూసే వక్షాలు, తెల్లవార్లూ అలాగే చూస్తూ ఉండాలనిపించే అందం.

❃ ❃ ❃

రాత్రి భోజనాలప్పుడు ఆమె ఒంటరిగా చెట్టు కింద కూర్చోడానికి కారణం అడిగాడు. ఆమె ముఖంలో కాంతి ఆరిపోయింది. "నేనంటే అందరికీ భయం. దూరంగా ఉంటారు" జోక్‌లాగ చెప్పిందిగాని నవ్వలేదు. గొంతులో జీర. కళ్ళలో తళుక్కుమన్న కన్నీటి కణం. ఆ విషాదాన్ని భరించలేకపోయాడు.

"తర్వాత చెబుతాలెండి" అంతలోనే నవ్వేసింది.

❃ ❃ ❃

మర్నాడుదయమే ఒక ఆడియో క్యాసెట్ అతని ప్రక్కనే పడేసి "నా భావాల డైరీ యిది. రాత్రి మీరడిగిన ప్రశ్నకు జవాబు" అంటూ వడివడిగా వెళ్ళిపోయింది. తను కాలేజీకి వెళ్లడానికింకా టైమ్ ఉండడంతో క్యాసెట్ వింటూ కూర్చున్నాడు అమర్.

"యూనివర్సిటీలో అడుగుపెట్టగానే, అడ్డూ అదుపూ లేని స్వేచ్ఛతో ప్రకృతిలో నిన్నలేని అందాలు కనిపించసాగాయి నాకు. జగమే మధురంగా ఊగులాడుతుంటే రంగుల కలల్లో మనసు విహరించసాగింది. నా చుట్టూ ఎందరో అబ్బాయిలు. నాకెంతో గర్వంగా ఉండేది. మరీ దగ్గరగా వచ్చేశాడు మదన్. పెళ్ళి చేసుకోవాలనుకున్నాం. డాడీని రప్పించి విషయం చెప్పాను. వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూ ఉండగా రహస్యంగా విన్నాను. నా నెత్తిన పిడుగు పడింది. కాళ్ళ కింద భూమి కుంగిపోయింది. మా పెళ్ళి ఇష్టం లేక డాడీ అబద్ధం చెబుతున్నారనుకున్నాగాని మెడికల్ రిపోర్ట్ చూశాక నా కలల రాజ్యంలో కారుచీకటి. హృదయంలో అనంత శూన్యం. మదన్ మాత్రమే కాదు నా ఫ్రెండ్స్ అంతా నాకు దూరం అయ్యారు. చాటుమాటుగా వేళాకోళాలూ, వ్యాఖ్యలూ నా గురించి. నేనిప్పుడు ఛిద్ర శిల్పాన్ని."

క్యాసెట్ ఆపి ఎంత ఆలోచించినా అమర్‌కి ఆమె సమస్య అర్థం కాలేదు. తర్వాత,

"ఔను అమర్‌గారూ! నాది మందులేని మహమ్మారి రోగం. కాకినాడలో బి.ఎ. చదువుతున్న రోజుల్లో కారు యాక్సిడెంట్‌లో నాకు అధిక రక్తస్రావం జరిగితే నా ప్రాణాలు కాపాడడానికి హడావుడిగా రక్తం సేకరించి పరీక్షించకుండా ఎక్కించేశారు. నన్ను ఎయిడ్స్‌కి బలి యిచ్చేశారు. ఔను అమర్ నాకు ఎయిడ్స్"

కాసేపు ఏమీ వినిపించలేదు. దుఃఖం గొంతు నొక్కేసింది కాబోలు. తర్వాత ,

"ఏ పాపం చేయకుండానే శిక్ష అనుభవిస్తున్నా. బహుశా గతజన్మ పాపం ఈ జన్మ శాపం అయిందేమో. నా రోగాన్ని దాచిపెట్టి వివాహం చేసుకొని మరో జీవితం నాశనం చేయడం నాకిష్టం లేదు. కన్యగానే తనువు చాలించాలనుకున్నాను. అయితే నా జబ్బు సంగతి బయటపడక ముందు నా స్నేహితురాళ్ళు తమ రొమాంటిక్ ఎఫైర్స్ గురించి వివరించేవారు. ఇప్పుడు స్నేహితులెవరూ లేని నా ఒంటరి తుంటరి యౌవన మనసులో ఆ వివరాలన్నీ సుడులు తిరుగుతున్నాయి. నేనెలాగూ నాలుగైదేళ్ళలో చనిపోతాను. ఈ లోగా తగిన జాగ్రత్తలతో ఒక్కసారి, ఒకే ఒక్కసారి ఆ అనుభవం తెలుసుకోవాలన్న తపన నన్ను దహించేస్తోంది. సైగ చేస్తే చాలు ఎందరో యువకులు వచ్చి వాలుతారు. అలా వచ్చినవారి మదిలో కామం తప్ప ఆత్మీయత, గౌరవం ఉండవు. నన్నొక వేశ్యగా కాముకిగా భావిస్తారు. నేనది తట్టుకోలేను. భార్యాభర్తల మధ్య ఎలాంటి మమతానురాగాలుంటాయో అవి నాకు కావాలి. ఏడడుగుల బంధం నాకు ప్రాప్తం లేదు.కానీ ఒకే ఒక అడుగు అనుబంధం కావాలని వయసు పరితపిస్తోంది. ఎంత కట్టడి చేసినా మనసు మాట వినడం లేదు. అమర్‌గారూ! మీ రాకతో నా మనసు వశం తప్పుతోంది. ఒకే ఒక అడుగు అనుబంధం అర్థించాలని మనసు వేగిరపడుతోంది."

క్యాసెట్ ఆపేశాడు అమర్. మనసు వికలం అయింది. కాలేజీ మానేసి పిచ్చి పట్టినట్టు బీచ్‌లో తిరిగాడు. ఊరట కలగలేదు. సాయంకాలం గెస్ట్‌హౌస్‌ని చేరుకున్నాడుగాని జీవని కనిపించలేదు. సింహాచలంకి వెళ్ళిందని వెంకన్న చెప్పాడు. గదిలో విగ్రహంలా కూర్చున్నాడు. కాలం గడుస్తోంది. గదిలోనూ, మదిలోనూ చీకటి పరుచుకుంది. వెంకన్న లైట్ వేసి గదిలోని చీకటిని పారద్రోలాడుగాని మదిలోని చీకటి అలాగే

(మిగతా 14వ పేజీలో చూడండి)


## త్వరలో వెండితెరపై కరిష్మా!



వివాహబంధం దెబ్బ తినడంతో కరిష్మా కపూర్ మళ్ళీ నటనవైపు మొగ్గు చూపారు. ఇప్పుడు ఆమె ముందు నలుగురు డైరెక్టర్లు, నాలుగు స్క్రిప్ట్‌లను ఉంచారు. అయితే దేనిలో ముందు నటించాలన్న దానిపై కరిష్మా తల్లిదండ్రులతో తర్జనభర్జనలు జరుపుతున్నట్లు భోగట్టా! అత్తింటివారు ఆమె నటించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. కానీ ఆమె నటించడానికే సన్నద్ధమయ్యారు. అయితే కరిష్మా మళ్ళీ హీరోయిన్‌గానే కనిపించబోతున్నారు. ఆమె నటించడానికి సిద్ధమయ్యారన్న విషయం తెలియగానే నాలుగు పెద్ద సంస్థలు ఆమెతో చిత్రం తీయడానికి ముందుకు రావడం ఇక్కడ గమనార్హం. ఆమె నటించినా ప్రేక్షకులు ఎంత వరకూ రిసీవ్ చేసుకుంటున్నారన్నదే అసలు సందేహం!



# పారిశుద్ధ్యం ఎడల కూడా ప్రభుత్వం శ్రద్ధ చూపాలి




బీదరికం వల్ల నివాస వసతి లేనివారు మరియు పట్టణాలకు పనికొరకు వచ్చేవారు మరుగుదొడ్లు లేక నానా యాతన పడుతుందంటారు. వీరు రోడ్డు ప్రక్కనే కాలకృత్యాలు తీర్చుకుంటూ వుంటారు. వీరి పరిస్థితి దయనీయం. తప్పనిసరి పరిస్థితులలో వారు అట్లా చేస్తుంటారు. ఈ దృశ్యాలు జుగుప్స కలుగ చేస్తుంటాయి. దీనివల్ల అనారోగ్యం పరిస్థితులు కలుగుతుంటాయి. ఈ చర్య జాతి గౌరవానికి హాని కలిగిస్తుంది. మానవుడు జీవించటం అంటే మర్యాదగా, గౌరవంగా జీవించటమనే అర్థం. జీవించటానికి అర్థం వుండాలి. జంతువుల్లా జీవించటం అనేది జీవించటం కాదు. మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు గురించి చెబుతున్నది. దీని ప్రకారం గౌరవంగా జీవించడం అనేదే కాకుండా ఇతర అనేక జీవన వసతులు కూడా కలిగి వుండాలి అని అర్థం చేసుకోవాలి.

పౌరులు గౌరవంగా జీవించేటట్లు చూడవలసిన బాధ్యత ప్రభుత్వానిది. పౌరులకు, ప్రభుత్వం వసతులు కల్పించాలి. అట్లా చేయకపోవటం, ఆర్టికల్ 21ని కాదనట్లే అవుతుంది. మరుగుదొడ్ల వసతి కల్పించటం ప్రభుత్వ బాధ్యత.

కనుక, జైపూర్ మునిసిపాలిటీని మరియు రాజస్తాన్ ప్రభుత్వాన్ని వంద మరుగుదొడ్లు వెంటనే కట్టించాలని ఆదేశించింది. ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ కట్టించిన మరుగుదొడ్లు చూసి ఆ విధంగా కట్టించండి. జైపూర్‌లో అవసరమైనచోట వీటిని ప్రజా వినియోగార్థము, మూడు నెలలలో కట్టించాలని కూడా ఆదేశించింది. జైపూర్ మునిసిపల్ కార్పొరేషన్ మరియు ప్రభుత్వం ఈ విషయంలో ఎట్టి చర్య తీసుకొన్నదీ తెలియజేస్తూ, ఒక అఫిడవిట్, 15 రోజులలో ఈ కోర్టులో దాఖలు చేయాలి అని కూడా ఆదేశించిన రాజస్తాన్ హైకోర్టు, ప్రజల అవసరాల గురించి ఎంత శ్రద్ధగా ప్రవర్తించిందో, బాధ్యతతో నడుచుకొన్నదో అని ఆలోచిస్తే, ఆ హైకోర్టును మెచ్చుకోక తప్పదు. ఈ తీర్పు ఏఐఆర్ 2004 ఆర్ఎజె 17లో చూడొచ్చు.

జైపూర్ మనదేశంలో ముఖ్యమైన టూరిస్టు పట్టణం. విదేశీయులు ఎందరో వస్తుంటారు. వీరి మాట అటుంచి స్వదేశీయులు అనేకమంది వెళుతుంటారు. మరుగుదొడ్లు నిత్యం జీవితంలో అతి ముఖ్యమైనవి. వీటి సంగతి మరిస్తే, రోడ్లు మరుగుదొడ్లు కాక తప్పదు. పై తీర్పు అన్ని పట్టణాలకు వర్తింప చేసుకుంటే ఎంత బాగుంటుందో. మనరాష్ట్రంలో ఎవరైనా ఇట్టి విషయంలో రిట్ వేయదలచుకుంటే రాజస్తాన్ తీర్పును చూపవచ్చు. ❃

---

ఉండిపోయింది. వెంకన్న భోజనం తెచ్చాడు. కానీ అమర్ తినలేకపోయాడు. నడుం వాల్చాడు. అల్లకల్లోల కలత నిద్ర.

తెల్లవారింది కానీ ఆమె మాయం. తప్పించుకొని తిరుగుతోందన్న మాట. తెల్లవారు జామున హటాత్తుగా మెలుకువ వచ్చింది. ప్రక్క మంచం మీద ఆమె! తనవైపే తిరిగి తననే చూస్తూ చూస్తూ నిద్రలోకి జారుకున్నట్టుంది. ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. ఆమె గాఢ నిద్రలో ఉంది. నిద్రాభంగం కలిగించలేక మళ్ళీ నడుం వాల్చి ఆమెనే చూస్తూ తనూ నిద్రలోకి జారుకున్నాడు.

ఆ రోజంతా ఆమె కనిపించనే లేదు. రాత్రి చీకట్లో మంచం మీద జాగరణ ఉండి అర్ధరాత్రి పిల్లిలాగ జీవని గదిలోకి వస్తుండగా తక్కున లేచి లైట్ వేశాడు. బిత్తరపోయిన జీవని చట్టుక్కున వెళ్ళి లైట్ ఆర్పేసింది. ఆమె తన ఎదుటే నిల్చుందని అతనికి లీలగా తెలుస్తూనే ఉంది. "ఏమిటిదంతా? తప్పించుకొని తిరుగుతున్నావెందుకు?" ఆర్తిగా అడిగాడు. కాసేపు నిశ్శబ్దం.

"మదన్‌లాగ మీరూ పారిపోవాలని ఆశించారు. కానీ అలా జరగలేదు. మీ ఎదుట నిగ్రహాన్ని కోల్పోతున్నాను. మనసు గోల పెడుతోంది. ఉక్కిరిబిక్కిరి అవుతున్నా. తప్పో ఒప్పో తెలియడం లేదు. చనిపోయేలోగా ఒక్కసారి ఒకే ఒక్కసారి ప్లీజ్ నిరోధ్ ఉపయోగించి" తడబడుతూ చెప్పి సైలెంట్ అయిపోయింది ఆమె. అదుపు చేస్తున్న కొద్దీ పెల్లుబుకుతున్న ఆమె రోదన వినిపిస్తోంది. చెయ్యి చాపాడు. ఆ చెయ్యి ఆమె భుజం మీద పడింది.

## ఒక్కసారి ప్లీజ్ కథ

(7వ పేజీ తరువాయి)

బలంగా ఆమెను దగ్గరగా లాక్కున్నాడు. ఆమె అతనిని అల్లుకుపోయింది.

నుదుట, చెక్కిలిపై, మెడ మీద ఆర్తిగా ఆబగా చుంబించాడు. అతని పెదవులు ఆమె పెదవుల్ని వెదకి పట్టుకున్నాయి. వేడిగా మృదువుగా బలంగా. సునామీలో లంగరేసిన పడవల్లాగ అల్లలాడిపోతున్నాయామె పెదవులు. ఆమెను రెండు చేతుల్లోనూ బలంగా బిగించి దృఢంగా పెదవుల్ని ఆక్రమించి ఒణుకుపోగొట్టాడు.

తమకపు హోరు తగ్గాక పట్టు సడలించుకొని కొద్దిగా జరిగిందామె. హటాత్తుగా ఆమెలో భయం. తన స్వార్థం కోసం అతనిని బలి చేస్తున్నానా అని. అతడూ ఆలోచిస్తున్నాడు. తనకిద్దరు అన్నలు. ఒక చెల్లి. వాళ్ళందరికీ వివాహాలై తన గురించి పట్టించుకోలేనంత బిజీగా సంసార సాగరాలు ఈదుతున్నారు. తలిదండ్రులెప్పుడో చనిపోయారు. జీవనిని వివాహం చేసుకోడానికి ఏ సమస్యా లేదు ఆ జబ్బు తప్ప. దాని గురించి ఎవరికీ చెప్పనక్కరలేదు. ఆ జబ్బు తనకి సంక్రమించవచ్చు. కింగ్ జార్జ్ ఆస్పత్రిలో చక్కని ఎయిడ్స్ కౌన్సిలింగ్ దొరుకుతుంది. వాళ్ళ సూచనల్ని పాటించి మృత్యువుని మరికొంతకాలం వెనక్కి నెట్టవచ్చు. ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. ఎయిడ్స్‌కి మందు దొరకవచ్చు. దొరకకపోయినా ఫర్వాలేదు.

తను జీవని శేష జీవితాన్ని సుఖమయం చేస్తాడు. తర్వాత ఆమె జ్ఞాపకాలతో జీవిస్తాడు. తర్వాత తనూ వెళ్ళిపోతాడు. సంపూర్ణ ఆరోగ్యవంతుల కంటే కాస్త ముందుగా. ఇందులో బాధపడడానికేముంది? పిల్లలు పుట్టకుండా జాగ్రత్తపడితే చాలు.

చటుక్కున ఆమె నడుం చుట్టూ చెయ్యి వేసి దగ్గరగా లాక్కుని చెవిలో చెప్పాడు. "నీతో ఒక్క అడుగు కాదు, ఏడడుగులూ వేస్తా జీవనీ. నిన్ను పెళ్ళి చేసుకుంటా"

"అంత త్యాగం వద్దు అమర్. నేను శాపగ్రస్తను. రోగగ్రస్తను" కంగారుగా అంది.

"కాదు జీవనా, ఎయిడ్స్ సోకినవాళ్ళు నిజంగా అదృష్టవంతులు. ఎప్పుడు చనిపోతారో ముందుగానే తెలిసిపోతుంది వాళ్ళకి. అందువల్ల చక్కగా శేష జీవితాన్ని ప్లాన్ చేసుకొని నాలుగు మంచి పనులు చేసి తాము ఆనందిస్తూ అందరికీ ఆనందం పంచుతూ కాకుల్లాగ కాక హంసల్లాగ జీవించే అవకాశం వాళ్ళకి ఉంటుంది" మృదువుగా అన్నాడు లైట్ వేస్తూ.

జీవితం అంతా వెలుగు పరుచుకున్నట్టు ఆమె కళ్ళు మెరిశాయి. హృదయం పరవశించింది. ముఖం వెలిగిపోయింది. "ఒకే ఒక చిరుపుష్పం అడిగితే ఏకంగా పుష్పహారమే మెడలో వేస్తానంటున్నారు. నేనెంతో అదృష్టవంతురాల్ని అమర్" అంటూ అతని పాదాల మీద వాలిపోయిందామె.

ఆమెను లేవదీసి "నీ స్థానం అక్కడ కాదు, ఇక్కడ" అంటూ హృదయానికి హత్తుకున్నాడు అమర్. ❃